క్లుప్తంగా

వైభవంగా శ్రీపుష్పయాగం

తాళ్లరేవు: కోరంగి గ్రామంలో ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీపుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీవీ వేణుగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు పెద్దింటి శేషాచార్యులు నేతృత్వంలో చివరిరోజున స్వామివారికి వివిధ రకాల పుష్పాలు, పండ్లతో శ్రీ పుష్పయాగాన్ని భక్తి శ్రద్ధలతో చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నక్షత్ర పూజలు


విలసవిల్లి సూర్యారాధనలో పాల్గొన్న భక్తులు

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలో ఉన్న రామ మందిరంలో నిర్వహిస్తున్న మహా సౌరయాగంలో గురువారం నక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో సూర్యారాధన నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం మఖ నక్షత్ర జాతకులచే మర్రి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సూర్య నమస్కారాలపై శిక్షణ


విద్యార్థులతో సూర్యనమస్కారాలు చేయిస్తున్న సత్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: మాఘమాసం సందర్భంగా గోఖలేవీధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో గురువారం విశ్రాంత ఉపాధ్యాయుడు చక్కా సత్యనారాయణమూర్తి సూర్యనమస్కారాలు చేయించారు. సూర్యనమస్కారాలపై శిక్షణ ఇచ్చి రోజూ ఉదయం వాటిని నిర్వర్తించేలా అవగాహన కల్పించారు. మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంత లక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, వాకర్స్ జోన్ చైర్‌పర్సన్ దువ్వూరి సుబ్బలక్ష్మి, క్లబ్ మాజీ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సత్యనారాయణమూర్తిని మహిళా వాకర్స్ ప్రతినిధులు సత్కరించారు.

దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక వాహనం


వాహనాన్ని ప్రారంభిస్తున్న దొర తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలోని జిల్లా సత్వర వైద్య సేవల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సత్వర వైద్యం అందిస్తున్నట్టు డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర తెలిపారు. వీరిని వైద్యానికి తీసుకొచ్చేందుకు వీలుగా ఒక వాహనాన్ని ఏర్పాటు చేశారు. అద్దెకు తీసుకున్న ఆ వాహనాన్ని గురువారం డీఎం అండ్ హెచ్‌వో ప్రారంభించారు. డీఎం అండ్‌హెచ్‌వోతోపాటు అదనపు డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భారతలక్ష్మి, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జాన్ లెవి పాల్గొన్నారు.

రమణారావు పరామర్శ

ఉప్పలగుప్తం: ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను గురువారం అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేటలో సాకా సుందరమ్మ మృతి చెందగా ఆమె కుమారుడు బాలరాజు కుటుంబాన్ని, గోపవరంలో కుంచే వెంకటేశ్వరరావు కుటుంబాన్ని, ఉప్పలగుప్తం పంచాయితీ పరిధి పేరాయి చెరువులో పరమట శ్రీను తల్లి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పెయ్యల విష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి పినిపే జయరాజు, నడింపల్లి సుబ్బరాజు, నేలపూడి సుగంధ కుమార్ తదితరులు ఉన్నారు.

'కొత్త వీఓఏతో బ్యాంకు లావాదేవీలు చేయవద్దు'

కాట్రేనికోన: రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన ఏపీఎం ఏక పక్షధోరణితో కొత్తగా నియమించిన వీఓఏ మాతృశ్రీతో బ్యాంకు లావాదేవీలు నిర్వహించకూడదని రామస్వామి తోట గ్రామ సంఘం సభ్యులు తీర్మానం చేస్తూ యూనియన్ బ్యాంకు మేనేజరుకు వినతిపత్రం అందజేశారు. రామస్వామి తోట వీఆర్ఓఏ గిడ్ల జ్ఞానకుమారి నిధులు దుర్వినియోగం చేసిందనే అవినీతి ఆరోపణలతో గ్రామ సంఘ సభ్యులు ఆమోదం లేకుండా తొలగించారని, మాతృశ్రీ అనే మహిళను వీఓఏగా నియమించారన్నారు. ఏపీఎం శ్రీనివాసరాజుపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశామన్నారు. గ్రామ సంఘం సభ్యుల తీర్మానంతో వీఓఏను ఎంపిక చేసుకునేంత వరకు బ్యాంకు లావాదేవీలు జరపకూడదన్నారు.

రహదారులు గోతులమయం

- అధ్వానంగా మారిన రోడ్లు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రభుత్వం


గచ్చకాయలపోర వంతెన వద్ద ఛిద్రమైన నీళ్లరేవు రోడ్డు

కాట్రేనికోన: మండలంలో శివారు ప్రాంతాలకు వెళ్లే రోడ్లు గోతులమయంగా మారాయి. రోడ్ల మధ్యలో గోలు ఏర్పడి, రాళ్లు పైకి లేచిపోయి అధ్వానంగా ఉన్నాయి. దీంతో రాకపోకలక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

గోతులు కూడా పూడ్చలేదు

ప్రతి పల్లె రోడ్లను అభివృద్ధి చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారం చేపట్టిన ఎనిమిది నెలలు గడచినా కనీసం గోతులు కూడా పూడ్చలేని స్థితిలో ఉందని మండి పడుతున్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన రోడ్లు తప్ప కూటమి ప్రభుత్వం చేసింది ఏమీ లేదని బాహాటంగానే అంటున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని కాట్రేనికోన అయినాపురం మీదుగా ముమ్మిడివరం, కాట్రేనికోన -నీళ్లరేవు రోడ్లు గోతులుపడి దిగబడిపోయాయి. గెద్దనపల్లి-సత్తమ్మ చెట్టు రోడ్డు, రేవువారి పేట రోడ్డు, గోతులమయమయ్యాయి. ఈ రోడ్లలో మహిళలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఆటోలపై ప్రయాణం చేయాలంటే అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్లపై ప్రయాణించడం వల్ల అనారోగ్యపాలవుతున్నామని వాపోతున్నారు.

అధికారంలోకి వచ్చాక..

కాట్రేనికోన - నీళ్ళరేవు, అయినాపురం మీదుగా కాట్రేనికోన-ముమ్మిడివరం రోడ్డు గోతులం పడడతో అత్యవసర సర్వీసులు 108, 104 వంటి అంబులెన్సులు కూడా రాలేని స్థితిలో ఉన్నాయని చెబుతున్నారు. ఎన్నికల ముందు సంబంధిత అధికార పార్టీ నాయకులు గ్రామాలలో తిరుగుతూ తమకు ఓటు వేసి గెలిపించండి అధికారం చేపట్టిన తక్షణమే ఈ రెండు రోడ్లు పనులు చేపడతానని చెప్పారని, అధికారం చేపట్టిన తరువాత కనీసం కన్నెత్తి చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిర్రయానం రోడ్డు పనులకు ఆగమేఘాల మీద మండల పరిషత్ తీర్మానం చేయించి ఇప్పుడు గమ్మున ఉండి పోయారని పలువురు అంటున్నారు. నీళ్ళ రేవు -కాట్రేనికోన రోడ్డు వెంబడి చిర్రయానం, గచ్చకాయలపోర, నాగ పట్టణం, మర్రిచెట్టు కాలనీ, కాపులపాలెం, రాజానగరం, సత్తమ్మ చెట్టు, రేవువారి పేట, వేట్లపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతి రోజు మండల కేంద్రం కాట్రేనికోన, అమలాపురం వంటి పట్టణాలకు వెళ్లేందుకు ఎంతగానో దోహద పడుతుంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

అత్యవసర పరిస్థితిల్లో ఇబ్బందే..

> కాట్రేనికోన నుంచి నీళ్లరేవు వెళ్లే రోడ్డు గోతులు పడింది. ఆటోలు, మోటారు సైకిల్‌పై మండల కేంద్రం కాట్రేనికోన వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. 108, 104 వంటి అత్యవసర సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. అంబులెన్స్‌లో ఆసుపత్రికి వెళ్లేందుకు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు రహదారి పనులు చేపట్టండి.
>
> – ఎం.వెంకటరమణ, కాట్రేనికోన

త్వరలో మానవత సేవా సంస్థ ఏర్పాటు

రాష్ట్ర ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ జానికిరామరాజు


మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కరపత్రాలను విడుదల చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం పరిసర ప్రాంతాల్లో సేవలు అందించేందుకు త్వరలోనే లయన్స్ పర్యవేక్షణలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంస్థ రాష్ట్ర ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ ఎస్.జానికిరామరాజు అన్నారు. స్థానిక సర్ సీవీ రామన్ స్కూలులో లయన్స్ ప్రతినిధి జంపన సుమన్‌వర్మ ఆధ్వర్యంలో జరిగిన లయన్స్ కార్యక్రమంలో జానికిరామరాజు ఈ విషయాన్ని వెల్లడించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జానికిరామరాజుతోపాటు సంస్థ ఉండ్రాజవరం చైర్మన్ టీవీ కృష్ణారావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆ సేవా సంస్థ కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో లయన్స్ పూర్వపు మల్టిపుల్ చైర్‌పర్సన్ అనిల్ కుమార్ జైన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సూదా గణపతి, చిక్కాల సతీష్, యర్రమల్లి విశ్వేశ్వరరావు, బూరగాయల శివరామకృష్ణ, నడింపల్లి వెంకటరామరాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

చికెన్ షాపుల మూసివేత

పట్టణ సీఐ వీరబాబు


అమలాపురం మార్కెట్‌లో చికెన్ షాపు నిర్వాహకులతో మాట్లాడుతున్న పట్టణ సీఐ వీరబాబు

అమలాపురం టౌన్: ప్రజల ఆరోగ్యం కోసం కొన్ని రోజులపాటు చికెన్ షాపులు మూసివేసి సహకరించాలని పట్టణ సీఐ పి.వీరబాబు షాపుల నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రబలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలతోపాటు చికెన్ షాపుల యజమానులు కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక మార్కెట్ ఏరియాకు బుధవారం రాత్రి పట్టణ సీఐతోపాటు ఎస్సై తిరుమలరావు, సిబ్బంది వెళ్లి చికెన్ షాపుల నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఇప్పటికే బర్డ్ ఫ్లూపై అప్రమత్తత కూడిన కొన్ని మార్గదర్శకాలు విడుదల చేశారని, ఎక్కడా కూడా చికెన్ విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రజలను కూడా అప్రమత్తం చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాలతో పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాల్లో కోడి గుడ్డు వాడకాన్ని కొన్ని రోజులపాటు నిషేధించారు. బర్డ్ ఫ్లూ పట్టణంలో ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు పక్కాగా తీసుకుంటున్నారు.

క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల వివిధ జిల్లాల్లో జరిగిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన అమలాపురానికి చెందిన మాస్టర్స్ క్రీడాకారులు, బాలికలను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతోపాటు సూర్య వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించి సత్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఉదయం జరిగిన అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్సీ విజేతలను అభినందించారు. పతకాలతో సొంతూరు అమలాపురానికి వచ్చిన క్రీడాకారులు పట్టణానికే కాకుండా జిల్లాకు సైతం పేరు తీసుకువచ్చారని అన్నారు. అనంతపురంలో జరిగిన రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో మెహబూబర్ సిస్టర్స్ షహీరా, షకీలాలు హైజంప్, లాంగ్‌జంప్, పరుగు పందేల్లో ఆరు బంగారు పతకాలు సాధించడంపై వాకర్స్ అభినందించారు. పిఠాపురంలో జరిగిన 8వ యూత్ ఏపీ బాయ్స్ అండ్ గరల్స్ క్రీడా పోటీల్లో విజేతలైన ఎ.కామాక్షీ, ఆర్.దేవిలను సైతం అభినందించారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుతోపాటు బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సంసాని గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆకుల ఉమ, కుడుపూడి బుజ్జి, వాకర్స్ క్లబ్ ప్రతనిధులు కుడుపూడి త్రినాథ్, ముంగర ప్రసాద్, చప్పిడి శోభన్‌బాబు తదితరులు విజేతలైన క్రీడాకారులను అభినందించారు.

ముగిసిన వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవాలు

రూ.22,100 పలికిన స్వామివారి లడ్డూ


లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న బచ్చు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

తాళ్లరేవు: స్థానిక బాలాజీ నగర్‌లో ఆరు రోజులపాటు జరిగిన అలమేలుమంగా సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరిరోజున స్వామివారికి శ్రీపుష్పయాగం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో దేవేరులకు పూజలు చేశారు. అనంతరం తొగరు శ్రీనివాస స్వీట్ స్టాల్ వారు ఏర్పాటు చేసిన స్వామివారి లడ్డూకు వేలం పాట నిర్వహించగా బచ్చు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు రూ.22,100కు దక్కించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణతో అధిక దిగుబడి


అల్లవరంలో ఎలుకల బోరియల్లో మందు ఉంచుతున్న ఏఓ సత్యనారాయణ, రైతు రమేష్


నడిపూడిలో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న రైతు సేవా కేంద్రం సీఅండ్‌డీ వెంకటేశ్వర్లు

అల్లవరం: రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టడం ద్వారా వరిలో నష్ట తీవ్రత తగ్గి అధిక దిగబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. అల్లవరంలోని రైతు సేవా కేంద్రంలో ఉచిత ఎలుకల మందు పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ 4 గ్రాముల బ్రోమోడియోలిన్ మందు, 4 గ్రాముల నూనె, 192 గ్రాముల నూకలతో బాగా కలిపి విషపు ఎరను తయారు చేసుకోవాలన్నారు. 10 గ్రాముల చొప్పున కాగితాలతో పొట్లాలుగా కట్టి ఎలుకల బోరియల్లో పెట్టాలని సూచించారు. ఈ విధంగా రైతులందరూ సామూహికంగా చేయడం ద్వారా ఎలుకలను నివారించవచ్చున్నారు. అనంతరం రైతులకు బ్రోమోడియోలిన్ మందుని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శుభగణేష్, ఉద్యాన సహాయకులు ఈశ్వర్, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపట్టాలి

అమలాపురం రూరల్: వరి పంటలు నాశనం చేస్తున్న ఎలుకల నిర్మూలనను రైతులందరూ సామూహికంగా చేపట్టాలని రైతు సేవ కేంద్రం సీఅండ్‌డీఏ జి. వెంకటేశ్వర్లు అన్నారు. నడిపూడి గ్రామంలో సామూహిక ఎలుకలు నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు ఏంఏ షంషి, మండల వ్యవసాయ అధికారి కె.ధర్మ ప్రసాద్, ఏఈవో డి.ప్రేమ్‌కుమార్ వ్యవసాయ సహాయకులు ఈతకోట వెంటక ప్రసాద్, సర్పంచ్ చెల్లుబోయిన వెంకటేశ్వరరావు,రైతులు అరిగెల శ్రీనివాసరావు, భైరిశెట్టి సుబ్రహ్మణ్యం రైతులు పాల్గొన్నారు.

కగార్ ఆపరేషన్‌ను నిలిపివేయాలి

అమలాపురం టౌన్: కగార్ పేరుతో ఆదివాసీలు, మావోయిస్టులను ప్రభుత్వం తన బలగాలతో హతమార్చడం హేయమైన, అప్రజాస్వామిక చర్యని ప్రజా హక్కులు, విద్యార్థి సంఘాల ప్రతనిధులు అమలాపురంలో నినదించారు. కగార్ ఆపరేషన్‌ను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆ సంఘాల ప్రతినిధులు గురువారం సాయంత్రం నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించాయి. అటవీ సంపదను, సహజ వనరులను పెట్టుబడిదారులకు అడ్డదారిలో అప్పగించడమే కగార్ ఆపరేషన్ వెనుక ఉన్న కుట్ర అని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతి రావు ఆరోపించారు. ఈ ధర్నాలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నామాడి శ్రీధర్, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకుడు ఎ.బాబూరావు, పలు ప్రజా సంఘాల నాయకులు దీపాటి శివ ప్రసాద్, బొంతు రమణ, శెట్టిబత్తుల తులసిరావు, కొండా దుర్గారావు తదితరులు ధర్నాలో ప్రసంగించి కగార్ ఆపరేషన్‌ను వ్యతిరేకించారు.

సీబీఎస్ఈ పరీక్షలపై ఆందోళన వద్దు


మాట్లాడుతున్న పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి

యానాం: తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయడంతోపాటు ఈనెల 15వ తేదీ నుంచి జరగనున్న పరీక్షలపై విద్యార్థులు ఆందోళన చెందనవసరంలేదని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం సీబీఎస్ఈ పరీక్షలకు హాజరవుతున్న వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను తిరిగి నివృత్తిచేసుకుంటూ పరీక్షలు రాయడం ద్వారా మంచి మార్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, స్వీట్స్‌ను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో మల్లాడి కృష్ణారావు సమీక్షించారు.

హెల్మెట్ ధారణతో భద్రత

జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు


విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: కళాశాలలకు బైక్‌లపై వచ్చే విద్యార్థులు విధిగా హెల్మెట్లు ధరించి రావాలని, అలా రానివారి బైకులకు కళాశాలల్లో పార్కింగ్ కలిన్పించవద్దని జిల్లా రవాణాధికారి (డీటీవో) దేవిశెట్టి శ్రీనివాసరావు కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక విద్యానిధి కళాశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రహదారి భద్రత విషయంలో కళాశాలల యాజమాన్యాలు కఠినంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. 8 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు మైనార్టీ తీరకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బైక్‌లు ఇవ్వవద్దన్నారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన సదస్సులో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జ్యోతి సురేష్, కాశీ విశ్వేశ్వరరావు, కౌశిక్, విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఆకుల బాపన్ననాయుడు, ఎన్‌జీవో సంస్థ ప్రతినిధి వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఉద్యోగులకు వైద్య శిబిరం

అమలాపురం రూరల్: జిల్లాలో విద్యుత్ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విద్యుత్ శాఖ కోనసీమ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ సిద్దెల రాజబాబు గురువారం ప్రారంభించారు. అమలాపురం సాయి విశ్వాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ క్యాంపులో 125 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆపరేషన్ ఈఈ కె.రాంబాబు, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై. విజయానంద్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కె.సత్యకిషోర్, కోనసీమలో ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఐ.పోలవరం: మండలంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 11 కేవీ లైను నిర్మాణ పనుల కోసం ఐ.పోలవరం సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఆర్‌డబ్ల్యూఎస్, 11 కేవీ గుత్తినదీవి ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం ఏఈఈ కె.రాంబాబు గురువారం తెలిపారు. జి.మూలపాలెం, ఎర్రగ్రువు , చిన్న కొడప గ్రామాలకు, దుప్పులంక ఏటిగట్టు ఆక్వా చెరువులకు, జి .వేమవరం ఏటి గట్టు ఆక్వా చెరువులకు కూడా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

నేడు ఎంపీ వైథిలింగం యానాం రాక

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థాన పార్లమెంట్ సభ్యుడు వి.వైథిలింగం శుక్రవారం యానాం పర్యటనకు విచ్చేయనున్నారు. ఉదయం 10 గంటలకు పుదుచ్చేరి నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయంలో దిగి అక్కడ నుంచి రోడ్డుమార్గంలో మధ్యాహ్నం 11.30కు యానాం చేరుకుంటారని ప్రైవేట్ కార్యదర్శి ఎం ఆర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారిక పర్యటలో భాగంగా ఆయన మధ్యాహ్నం 3 గంటలకు ప్రముఖులతో సమావేశమవుతారన్నారు. ఈనెల 15వ తేదీన ఆర్ఏఓ చాంబర్‌లో జరిగే దిశా సమావేశంలో ఆయన ప్రసంగిస్తారని, ఆయన వెంట మాజీ సీఎం నారాయణసామి పాల్గొంటారన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విజేతకు సన్మానం


సూర్యకుమారిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పీఈటీ క్రీడా పోటీల్లో అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ ఎ.సూర్యకుమారి ఉత్తమ ప్రతిభ కనబరిచి ఐదు ఈవెంట్‌లో విజేతగా నిలిచింది. వాలీబాల్, త్రోబాల్ విన్నర్‌గా, బ్యాడ్మింటన్ డబుల్స్ విన్నర్‌గా, అథ్లెటిక్స్ ఈవెంట్లలోని షాట్‌పుట్‌లో ద్వితీయస్థానం, జావలిన్‌త్రోతో తృతీయస్థానం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుంట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. సూర్యకుమారిని పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది సన్మానించారు.

కిశోరి వికాసంపై అవగాహన


విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఐ.పోలవరం: బాలికల ఉన్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటే కిశోర దశలో ఉన్న పిల్లలు ఉన్నత అభివృద్ధి చెందుతారని ప్రముఖ సామాజిక కార్యకర్త, డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు అన్నారు. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఐ.పోలవరం మండలం మురమళ్ళ, కొమరగిరి హైస్కూళ్లలో విస్తరణాధికారి సీహెచ్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో కిశోర్ వికాస కార్యక్రమం గురువారం నిర్వహించారు. పోలీస్ కానిస్టేబుల్ సీహెచ్ సురేష్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాకు బాలికలు గురవుతున్నారని, వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిచయం లేని వ్యక్తుల మాటలను నమ్మి మోసపోకూడదని సూచించారు. బాలివివాహాలు జరిపించాలని కుటుంబ సభ్యులు నిర్ణయం తీసుకున్నప్పుడు 100, 1098, 121 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పాఠశాల సిబ్బంది, విద్యా కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ


మత్స్యకారులకు గొడుగులు పంపిణీ చేసిన వివిధ సంస్థల ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన సమీపంలోని ఆక్విడెక్ట్ రోడ్డులో నిత్యం చేపలు అమ్ముకునే మత్స్యకారులకు రాజమహేంద్రవరం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన గొడుగులను గురువారం పంపిణీ చేశారు. అమలాపురానికి చెందిన డాక్టర్ దేవరపల్లి రాజేంద్ర ప్రసాద్, వంగా వినోద్ స్పందించి మత్స్యకారుల తాత్కాలిక దుకాణాలకు నీడ లేని క్రమంలో స్వచ్ఛంద సంస్థ ద్వారా గొడుగులను సమకూర్చి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు, వివిధ సంస్థల ప్రతినిధులు సాపే బాలరవి, పెనుమాల చిట్టిబాబు, నక్కా రాజ్‌కుమార్, పాలమాటి రామకృష్ణ, దేవరపల్లి రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల పంపిణీపై సర్వే


చినబొడ్డు వెంకటాయపాలెంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

తాళ్లరేవు: దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ల పంపిణీపై ప్రముఖ న్యాయవాది యడ్ల కుటుంబరావు నేతృత్వంలోని బృందం ఇంటింటి సర్వే నిర్వహించింది. మండల పరిధిలోని తాళ్లరేవు, కోరంగి పంచాయతీల్లోని గ్రామాలలో పీహెచ్‌సీ వైద్యులు ఈశ్వర్ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి దివ్యాంగుల వివరాలను నమోదు చేసుకున్నారు. అర్హత ఉండి పింఛన్ రాని వారిని గుర్తించి ప్రభుత్వానికి నివేదించనున్నట్టు కుటుంబరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ బొడ్డు కుమార్, ఏఎన్‌ఎంలు ఆర్.సాయికుమారి, మాధవి, జ్యోతి, రోజా, ఎంఎల్‌హెచ్‌ఎపీలు సత్య, మీనా, సింధు, పూజిత హెల్త్ అసిస్టెంట్ కెఎస్ ప్రసాద్, కాలా ఆంజనేయులు, ఆశా వర్కర్లు దుర్గ, దేవి, కాసు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితులకు రూ.33 వేల జరిమానా

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో మద్యం సేవించి వాహనాలు డ్రైవ్ చేస్తున్న వారిపై పట్టణ పోలీసులు నిఘా పెట్టి తరచూ తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురు నిందితులను గురువారం స్థానిక కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.11 వేలు చొప్పున ముగ్గురికి మొత్తం రూ.33 వేల మేర జరిమానాలు విధించారని పట్టణ ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు.